క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వెంకటేశ్వర స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

మొగల్తూరు: స్థానిక కేతకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అర్చకుడు గంగా పవన్ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రసాదం స్వీకరించారు.

గ్రామాల్లో ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాలైన కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం సౌత్‌లలో పంట బోదె తవ్వకం పనులు చేస్తున్నారు. శనివారం కేపీపాలెం సౌత్‌లోని పంట కాలువ-5 పరిధిలోని మురుగు కాలువలో మట్టి నిలిచి పోవడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరందడం లేదు. దీంతో మురుగు కాలువ పాడవు నా ఉన్న పంట బోదెలో మట్టి తవ్వకం పనులు చేపట్టామని ఏపీఎం జె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

యలమంచిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ, మండల ప్రత్యేక అధికారి బి.వెంకటరమణ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం పెనుమర్రు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలకు పూర్తి స్థాయిలో రోడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ కంకిపాటి రాజారామ్, వీఆర్వో కొడవటి శ్రీరామమూర్తి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మత్తే బాబ్జి, వెల్ఫేర్ అసిస్టెంట్ మాతా రాజశ్రీ తదితరులు ఉన్నారు.

ఫ్యాన్ల బహూకరణ



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందిస్తున్న భవానీప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం లంకలకోడేరు-2 గ్రామానికి చెందిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాలుగు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. స్థానిక జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో దాత లయన్స్ జిల్లా లిటరసీ డైరెక్టర్ పీఎస్‌డీవీ ప్రసాద్ ఇచ్చిన ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుత్తుల శ్రీనివాస్‌కు శనివారం అందజేశారు. గతంలోనూ దాత ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో సాయం అందించారని గుర్తుచేశారు. దాతను విద్యాశాఖ మండల కోఆర్డినేటర్ తోకల జనార్దన్, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, కర్ణి జోగయ్య అభినందించారు.

పాఠశాలకు మైక్ బహూకరణ



దిగమర్రు ప్రాథమిక పాఠశాలకు మైక్ అందజేస్తున్న దాతలు

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ ప్రశంసించారు. పాలకొల్లు మండలం దిగమర్రు ప్రాథమిక పాఠశాల అవసరాల నిమిత్తం ఆ గ్రామ పెద్ద కుంచే రామకృష్ణారావు (బాబ్జి) మైక్‌ను విరాళంగా హెచ్‌ఎంకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీ పద్మావతి, ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోనీ, సహోపాధ్యాయులు దాసరి వెంకట నరసింహారావు, ఎ.వెంకటలక్ష్మి, వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ దొరకు సత్కారం



పెనుగొండలో ఎంపీడీఓ శ్రీనివాస దొరను సత్కరిస్తున్న పాలకవర్గం

పెనుగొండ: ఉత్తమ అధికారిగా కలెక్టరు పి.ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెనుగొండ ఎంపీడీఓ ఎస్ శ్రీనివాస్ దొరను శనివారం పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత సర్పంచ్ శ్యామలాసోనీ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించి, పలు అభివృద్ధి తీర్మానాలను ఆమోదించారు.

లైబ్రేరియన్‌కు సత్కారం

ఉత్తమ లైబ్రేరియన్‌గా కలెక్టర్ పి.ప్రశాంతి నుంచి అవార్డు అందుకొన్న సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లైబ్రేరియన్ అసిస్టెంట్ మల్లేశ్వరపు రామచంద్రరావు (రాము)ను శనివారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



నరసాపురం : కాటన్ పార్కులో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం రూరల్: సీతారాంపురం సౌత్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు



నరసాపురం : కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

- గత ప్రభుత్వానికి.. జగన్ పాలనకు మార్పు గమనించండి
- ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడిందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం నరసాపురంలోని 1 నుంచి 10 వరకు వార్డులు, 28, 29, 30, 31 వార్డులకు సంబంధించి నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక కాటన్‌పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలను ఉద్దేశించి ముదునూరి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు 100 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అందించిన పథకాల ద్వారా రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలు వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకుతీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ ఐదేళ్ల పాలనలో మంచి జరిగితేనే అండగా ఉండాలని ప్రజలను కోరుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వం నుంచి అందుతోన్న సహకారాన్ని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత జగన్ జనరంజక పాలనకు ఉన్న మార్పును గమనించాలని కోరారు. 635 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.5.67 కోట్ల చెక్కును ప్రసాదరాజు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. రుణమాఫీ అంటూ 2014లో టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసంచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కౌన్సిలర్లు అడిదల శ్యామల, సోమరాజు దుర్గాభవానీ, గోరు రమాదేవి, పతివాడ పద్మ, సిర్రా కాంతమ్మ, మల్లాడి బుజ్జి, వంగా శ్రీకాంత్‌కన్నా, ద్వారా ప్రసాద్, డ్వాక్రా సీఎంఎం సోమాని భాస్కర్, డీఈఓ ఆర్ షణ్ముఖ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం

నరసాపురం రూరల్: మహిళల సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం గొంది, చిట్టవరం, కొత్తనవరసపురం, పాతనవరసపురం, సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు, మల్లవరం, మల్లవరంలంక, కె.బేతపూడి, సీతారాంపురం నార్త్, సీతారాంపురం సౌత్ గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలకు శనివారం సీతారాంపురం సౌత్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. 10 గ్రామాలకు చెందిన 404 డ్వాక్రా గ్రూపులకు చెందిన 4,040 మంది అక్క చెల్లెమ్మలకు రూ.6.97 కోట్ల విలువ గల నమూనా చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వ్యక్తికీ సగటున రూ.2.50 లక్షల ప్రత్యక్షంగా లబ్ధి చేకూర్చారని చెప్పారు. పేదరికం అనే రాక్షసిని జయించడానికి ఆసరా, చేయూత, అమ్మ ఒడి, కాపు నేస్తం, రైతు భరోసా, వంటి పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తూ మహిళల స్థితిగతులను మార్చారని చెప్పారు. నరసాపురం మండలంలో 1,577 డ్వాక్రా మహిళా గ్రూపుల్లో 15,770 మహిళల ఖాతాల్లో నాలుగో విడత రూ.15.78 కోట్లు జమైందన్నారు. గత ఐదేళ్లలో మొత్తం నాలుగు విడతలు కలిపి రూ.63.18 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, గ్రామ సర్పంచ్‌లు దొండపాటి వెంకటేశ్వర్లు, పులపర్తి భ్రమరాంబ, లేస్‌పార్కు సొసైటీ అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పులపర్తి ప్రతాప్, జేవీఆర్, అద్దంకి బ్రహ్మాజీ, దొంగ మోహనరావు, కడలి అలివేలు మంగతాయారు, ఎంపీడీఓ ఎంవీ రమణ, ఏపీఎం పిప్పళ్ల పద్మ, మండల సమాఖ్య ప్రెసిడెంట్లు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్‌ను కనిపెట్టిన మహనీయుడు ఫారడే



పాలకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విశ్వమానవాళికి వెలుగునిచ్చిన మహనీయుడు థామస్ ఆల్వా ఎడిసన్ అని అతను బల్బ్‌ను కనిపెట్టిన రోజున ఎలక్ట్రీషన్ డేగా నిర్వహిస్తున్నట్టు పట్టణ ది పాలకొల్లు ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్, ప్లంబర్స్, వైండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మిద్దే పాండురంగారావు అన్నారు. ఎలక్ట్రిషన్ డే సందర్భంగా శనివారం అసోసియేషన్ భవనం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడారు. విద్యుత్‌ను కనిపెట్టిన మహనీయుడు మైఖేల్ ఫారడే అని గుర్తుచేశారు. థామస్, ఫారడే వంటి మహనీయుల వల్ల నేడు ఎంతోమంది విద్యుత్ పనుల్లో, ఉద్యోగాల్లో ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా రంకిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శిగా మేకా వరప్రసాద్, ట్రెజరర్ కుక్కల నరసింహారావులను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కార్యక్రమంలో నక్కా రాజు, గింజాల సత్యశ్రీను, వెలిగట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పూడికపై గప్‌చుప్



అధికారుల అనుమతి లేకుండా పూడ్చేస్తున్న చెరువు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాలకొల్లు రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న చెరువును పూడ్చివేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. టీఎస్ నెంబర్ 146-1లో సుమారు 90 సెంట్లు భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ చెరువు ఇంకా ల్యాండ్ కన్వర్షన్ అవ్వలేదని వారు పేర్కొంటున్నారు. అలాగే మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు మట్టి పూడికకు అనుమతులు ఇవ్వలేదు. అయితే ఈ స్థలం నలుగురు రైతులది కాగా ఓ ప్రజాప్రతినిధి చెరువు పూడ్చిస్తామని హామీ మేరకు కొంత స్థలాన్ని రాయించుకున్నట్లు పట్టణ వాసులు పేర్కొంటున్నారు. చెరువు నీటిని రైల్వే స్థలంలోకి తోడేస్తున్నా రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే ఈ ఘటనపై తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజును వివరణ కోరగా రిపోర్ట్ తయారు చేయాలని రెవెన్యూ అధికారులను పంపామని, నివేదిక వచ్చిన తరువాత పరిశీలిస్తామని పేర్కొన్నారు. అలాగే మైనింగ్ ఆర్‌ఐ రమణను వివరణకోరగా ప్రస్తుతానికి పనులు ఆగాయని పూడిక జరిగితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు భవన నిర్మాణల ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని ఓడూరు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.88.34 లక్షలతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించనున్నట్టు గ్రామ సర్పంచ్ బుర్రా రవికుమార్ తెలిపారు. రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రారంభిస్తారని వెల్లడించారు. వెలగలేరులో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఆలమూరు పంచాయతీ కోమటిచెరువు జగనన్న కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన పాఠశాల, రూ.25 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాలను, రూ.85 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్, పంట కాలువ నిర్మాణ పనులను శ్రీరంగనాథరాజు ప్రారంభిస్తారని సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ తెలపారు. మంత్రులు, జిల్లాఅధికారులు పాల్గొంటారని చెప్పారు.

క్రీడాకారులకు ప్రశంసలు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ప్రవీణ్



లాన్ టెన్నీస్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన ధీరజ్



జ్ఞాపికతో చెస్ క్రీడాకారుడు మానస్



పురస్కారం అందుకుంటున్న మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: 75వ గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ స్థాయి క్రీడాకారులకు అవార్డులు ప్రదానం చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో లాన్ టెన్నిస్ ఆటలో జాతీయ స్థాయిలో ఎంపికైన ఆదిత్య స్కూల్ విద్యార్థి వి.భవన్‌ధీరజ్, గతేడాది తమిళనాడులో జరిగిన జాతీయ చదరంగం పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థి మద్దుల మానస్, విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన పాలకొల్లు 7వ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ బి.హనీ ప్రవీణ్‌లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా అవార్డు, ప్రశంసా ప్రతాలను అందుకున్నారు.

మురళీకృష్ణకు సేవా పురస్కారం

పాలకొల్లు పట్టణానికి చెందిన విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

జీవితంలో గుడి కూడా అంతర్భాగమే



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



మేళతాళాలతో కమిషనర్ సత్యనారాయణను తీసుకొస్తున్న ఆలయ అధికారులు

కమిషనర్ ఆర్ సత్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: మన జీవితంలో ఆలయం కూడా ఒక అంతర్భాగమేనని, అలాంటి సనాతన హిందూ ధర్మం గురించి నేటి యువతరానికి తెలియజేయాలని ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని దేవదాయ శాఖ కమిషనర్ రాము సత్యనారాయణ అన్నారు. శనివారం పాలకొల్లు పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం కూడా మహాయాగం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈ సంవత్సరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణల ఆదేశాలతో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసు మాట్లాడుతూ ఆలయ గాలిగోపురం మరమ్మతుల నిమిత్తం నిధులు సమకూర్చాలని అలాగే క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి దక్షిణ భాగంలో ఉన్న స్థలంలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి నిధులు ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుండి కమిషనర్ సత్యనారాయణకు స్వాగతం పలుకుతూ మేళతాళాలతో ఆలయం వరకూ తీసుకొచ్చారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో కుంకుమ పూజలు జరిపించారు. ఈ కుంకుమ పూజల్లో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. మద్దూరి సూరిబాబు బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, రాజమండ్రి ఆర్‌జేసి ఎంవీ సురేష్‌బాబు, కాకినాడ డీసీఎం విజయరాజు, జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు, భీమవరం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల ఎరమందు పంపిణీ



చినమల్లంలో ఎలుకల ఎరమందు పంపిణీ చేస్తున్న మార్టేరు శాస్త్రవేత్తలు

పెనుగొండ: వరిలో ఎలుకల నివారణకు సమూహికంగా కృషి చేయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎలుకుల విభాగం శాస్త్రవేత్త ఎన్ శ్రీనివాసరావు అన్నారు. పరిశోధనా స్థానం దత్తత గ్రామమైన చినమల్లంలో శనివారం ఎలుకల నివారణకు ఎరమందు పంపిణీ చేశారు. వరి పంట దిగుబడి తగ్గడానికి పురుగులు, తెగుళ్లతో పాటు ఎలుకలూ ఉంటాయన్నారు. ఎలుకల వల్ల 5 నుంచి 10 శాతం పంట నష్టం వాటిల్లుతుందని, ఎకరాకు 20 బుట్టలు పెట్టడం ద్వారా ఎలుకలను నివారించవచ్చని తెలిపారు. మార్టేరు వరి పరిశోధనా స్థానం రూపొందించిన యంత్రాన్ని ఉపయోగించి బొరియల్లో పొగబారించడం ద్వారా ఎలుకలకు ఊపిరి ఆడకుండా చేసి చంపివేయవచ్చని చెప్పారు. మరో శాస్త్రవేత్త బి.అనూష మాట్లాడుతూ బ్రోమోడయోలోన్, జింక్ పాస్ఫైడ్ వినియోగించడం ద్వారా ఎలుకల రక్తహీనతతో చనిపోయే విధంగా చేయవచ్చన్నారు. వ్యవసాయాధికారి పి.స్పందన, శాస్త్రవేత్తలు డాక్టర్ ఆనందకుమార్, వ్యవసాయ సహాయకుడు మనోజ్‌కుమార్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సేవాదళ్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రాయుడు



వెంకట్రాయుడిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు అర్బన్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం సేవాదళ్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ సేవాదళ్ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ చినిమిల్లి వెంకట్రాయుడు కోరారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి సేవాదళ్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు, పశ్చిమగోదావరి, రాజమండ్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో 35 నియోజకవర్గాల్లో 15 వేల మంది సేవాదళ్ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ విజయం కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పాలకొల్లులో విజయం సాధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వడానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు ముచ్చర్ల శ్రీరామ్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు భలే ఏసుబాబు, పోడూరు మండల సేవాదళ్ అధ్యక్షుడు దిద్దే శ్రీనివాస్ తదితరలు మాట్లాడారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సేవాదళ్ అధ్యక్షులు వీరే

పాలకొల్లు పట్టణ, పోడూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల సేవాదళ్ అధ్యక్షులుగా గేదెల జానకిరామ్, బీరా రాజశేఖర్, రౌతు కృష్ణ, మామిడిశెట్టి చంద్రరావు, సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా బొడ్డు సుబ్బారావులను వెంకట్రాయుడు ప్రకటించారు. వీరిని శాలువాతో సత్కరించారు. పార్టీ కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, పితాని సత్యనారాయణ, అడబాల వెంకటరమణ, ఉచ్చుల స్టాలిన్, ఆలయాల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉన్నత భవిష్యత్తు



మేడపాడు హైస్కూల్లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వెంకట్రావు

యలమంచిలి: హైస్కూల్ స్థాయి నుంచే సాంకేతిక విద్య అభ్యసించడం వల్ల ప్రతి విద్యార్థికీ ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు అన్నారు. మేడపాడు హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన ట్యాబ్‌లను శనివారం ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందుబాటులోనికి తీసుకురావడమే జగనన్న లక్ష్యమన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాద్, ఉపాధ్యాయులు మంచెం వెంకటేశ్వరరావు, పంతం రామ్మూర్తినాయుడు, ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ అడబాల లేఖ్య సాయివేణి తదితరులు పాల్గొన్నారు.